క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సాయి సంజీవని ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అయ్యప్ప మాలాధారులు నిష్ఠతో దీక్షలు చేస్తుంటారని వీరి ఆరోగ్యం కోసం ఈసీజీ,బీపీ, షుగర్ పరీక్షలు చేసినట్లు డాక్టర్ రవికుమార్‌రెడ్డి తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాను, రాజేష్‌రెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోమటివాని చెరువు వేలం

– రూ.1.85 లక్షల ఆదాయం

మదనపల్లె : పట్టణంలోని కోమటివానిచెరువులో చేపలు పట్టుకునేందుకు నిర్వహించిన వేలంపాటల్లో ప్రభుత్వానికి రూ.1.85 లక్షల ఆదాయం లభించినట్లు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు మోహన్‌కృష్ణ, రూబీనా తెలిపారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీ సచివాలయం ఆవరణలో నిర్వహించిన వేలంపాటల్లో చేపల వ్యాపారి నాగిరెడ్డి రూ.1.85 లక్షలకు కోమటివానిచెరువులో చేపలు పట్టుకునే హక్కులను సొంతం చేసుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

రామసముద్రం : డిసెంబర్ చివరిలోపు సీసీ రోడ్డు నిర్మాణపనులు పూర్తిచేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ సూచించారు. మంగళవారం కాప్పల్లెలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణపనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. అలాగే కాప్పల్లె గ్రామసచివాలయంను తనిఖీ చేసి సిబ్బంది హాజరుపట్టీని, టూర్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని దిశ పోలీసుస్టేషన్ ఎస్.ఐ రమాదేవి అన్నారు. మంగళవారం మదనపల్లె సమీపంలోని కూరపర్తి సాయిచైతన్య స్రవంతి అనాథాశ్రమం, స్థానిక ఫైర్‌స్టేషన్ వద్దనున్న బాలసదనంలో సాయిడ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు రేణుక(చిట్టి) జన్మదినం పురస్కరించుకుని విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. బాలసదనంలో విద్యార్థినులకు కాస్మోటిక్ వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అనసూయ, కూరపర్తి ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభరెడ్డి, బాలసదనం మేట్రిన్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

పీలేరు : సీపీఎస్ విధానం రద్దు చేసి పాతన పెన్షన్ విధానం అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో తలపెట్టిన పాతపెన్షన్ సాధనసభ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఫ్యామిలీ పెన్షన్, గ్రాటిటీ జీవోలను అమలు చేయాలన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు ఏడాదిలోగా పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యలపై అర్జీలు

కలకడ : భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ పనికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ముడియంవారిపల్లెలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల, ప్రజల అందించిన వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. తహసీల్దార్ దృష్టికి రైతులు అనేక సమస్యలను తీసుకువచ్చారు. ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. భాగపరిష్కారిలు కాని భూములు ఉంటే సర్వేకి చెలానా చెల్లించి ఆధారాలు చూపించి రికార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, సర్వేయర్, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

గొయ్యి పూడ్చేశారు



పూడ్చివేసిన గొయ్యి

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: స్థానిక హంద్రీ–నీవా కాలువపై నిర్మించిన బ్రిడ్జి వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా ఉందన్న విషయాన్ని సాక్షి ఎవరికీ పట్టని గొయ్యి శీర్షిక ప్రచురితమైన కథనంపై హంద్రీనీవా అధికారులు స్పందించారు. కాలువపై మొక్కల తొలగింపు చర్యలు చేపట్టిన యంత్రాలతో గొయ్యిలో మట్టిపోసి పూడ్చేయించారు. దీనితో వాహనాల్లో రాకపోకలు సాగించే వారికి ప్రమాదాలు తప్పాయి.

పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలి

మదనపల్లె సిటీ: పరీక్షల సమయం దగ్గరపడుతోంది. ఇప్పటి వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదువుపై దృష్టి సారించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక కాలేజీలో సంకల్ప కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంకును అందజేశారు.

ఉపాధిలో అవినీతి ఊడలు

- ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు
- యంత్రాలతో పనులు చేసి సొమ్ము స్వాహా
- నేటి నుంచి సామాజిక తనిఖీ



పెద్దతిప్పసముద్రం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి బుధవారం నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించనుంది. గత ఏడాది ఏప్రల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొత్తం 1,461 పనులు జరిగాయి. ప్రభుత్వ భవనాలతో పాటు ఈ పనులకు సంబంధించి మొత్తం రూ.9.07 కోట్ల నిధులు వెచ్చించారు. భవన నిర్మాణాలను మినహాయిస్తే మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా రెండు, మూడు పంచాయతీలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి కూలీల పనుల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్లు ప్రజల్లో విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

దొడ్డిదారిలో బిల్లులు స్వాహా

గతంలో జరిగిన వాటర్‌షెడ్ పనుల్లో కూడా యంత్రాలతో చదును చేసి దొడ్డిదారుల్లో ఉపాధి ద్వారా బిల్లులు స్వాహా చేసినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అంతేగాక హార్టికల్చర్‌లో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలకు సంబంధించి రైతులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందలేదనే ఆరోపణలు కోకొల్లోలు. రైతులకు అందాల్సిన సొమ్మును కూడా ఉపాధి సిబ్బంది దిగమింగి జేబులు నింపుకున్నారని విశ్వసనీయంగా తెలుస్తోంది. గతంలో బహిర్గతం చేసిన అవినీతి సొమ్ము కంటే సామాజిక తనిఖీ బృందంకు అయిన ఖర్చే ఎక్కువ అని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. డీఆర్పీల బృందం చేపట్టే తనిఖీలో నిధుల దుర్వినియోగంపై ఏ మేరకు బహిర్గతం చేస్తారో బహిరంగ సభ వరకు వేచి చూడాల్సి ఉంది.

బాగా చదివితే ఉజ్వల భవిష్యత్తు

డీఈఓ సుబ్రమణ్యం



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

బి.కొత్తకోట: బాగా చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేజీబీవీ బాలికలతో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఆయన స్థానిక కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేశారు. జూనియర్ కళాశాల, పదవ తరగతి విద్యార్థులు అప్పటికే స్టడీ అవర్‌లో ఉండగా బాలికలతో వివిధ అంశాలపై ముచ్చటించారు. పాఠ్యాంశాలను ఎలా చదవాలి, ఎన్నిగంటలు చదవాలి, పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు పాటించాల్సిన సూచనలను వివరించారు. ఎంఈసీ గ్రూప్‌తో సీఏ చదవచ్చని సూచించారు. దీనికి చాలా అవకాశాలు, భవిష్యత్తు ఉందని తెలిపారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి రాబట్టారు. బాలికలకు అందిస్తున్న సౌకర్యాలు, హాస్టల్ వసతి, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. అర్ధసంవత్సర పరీక్షలకు బాలికలను సిద్ధం చేస్తున్నామని ప్రత్యేకాధికారిణి విశ్వలత ఆయనకు వివరాలు తెలిపారు.

చౌక దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి: మండల పరిధిలో ఖాళీగా ఉన్న పది, కలికిరి పట్టణంలో మరో ఐదు నూతనంగా ఏర్పాటు కానున్న చౌకదుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ మదనపల్లి సబ్ కలెక్టరు మేఘస్వరూప్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీటిలో గుట్టపాళెం పంచాయతీ పరిధిలోని షాపు నెంబర్లు 2(ఓసీ విజో), 3(ఓసీ–మహిళ), 5(ఓసీ), మర్రికుంటపల్లి పంచాయతీలోని షాపు నెం.14(బిసీ–బి, మహిళ), పారపట్లలోని షాపు నెం.18(ఓసీ), చీకటిపల్లి పంచాయతీ పరిధిలోని రంగనాథపురం షాపు నెం.19(బీసీ–ఏ), పత్తేగడ పంచాయతీ నగిరిపల్లి షాపు నెం.20(ఓసీ–మహిళ), గుండ్లూరులో షాపుం నెం.28(ఓసీ), మహల్‌లో షాపు నెం.30(ఓసీ–మహిళ), 31(ఎస్సీ–మహిళ) లకు, కలికిరి పట్టణ పరిధిలోని షాపు నెం.6 పరిధిలో కాలేజి రోడ్డులో 1(ఓసీ), షాపు నెం.10 పరిధిలోని బండకాడపల్లి(ఎస్సీ–మహిళ)చ ఏఎస్‌ఆర్ కాలని(ఓసీ), షాపు నెం.11 పరిధిలో ఇందిరమ్మకాలని(బీసీ–బి, మహిళ), బీడీ కాలని(ఓసీ–మహిళ) కొత్త షాపులు, మొత్తం 15 షాపులకు ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంటర్ ఉత్తీర్ణులు లేని చోట ఇంటర్ ఫెయిల్ అయివారికి అవకాశం ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 18సం.లు నుంచి 40సం.లు మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలన్నారు. రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించి ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళ వారం ఆయన మండలంలో పర్యటించారు. కుక్కరాజుపల్లె పంచాయతీ కుమ్మరపల్లి రాజేష్‌కుమార్‌రెడ్డి నూతనంగా నిర్మించిన గృహాన్ని సందర్శించారు. ప్రజలను యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎద్దులవారిపల్లెలో కరీముల్లా నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోసువారిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు బావాజీ, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై చలించి సొంత నిధులతో తిరుపతి ఆర్థోపెడిక్ ఆస్పత్రికి వైద్య చికిత్సల కోసం పంపారు. అనంతరం ఎర్రివారిపల్లెలో శివశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన అయ్యప్పమాలాధారులకు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

– డీపీఓ బాలకృష్ణారెడ్డి

నిమ్మనపల్లె : రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ, ప్రత్యేకాధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముష్టూరు పంచాయతీ గ్రామసచివాలయం వద్ద తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వివిధ రకాల భూసమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు సదస్సులో తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుడికి రసీదు అందజేయడంతో పాటు నిర్ణీత కాలపరిమితిలోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముష్టూరు రెవెన్యూ సదస్సులో 45 దరఖాస్తులు అందగా, వెంగంవారిపల్లెలో 127 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రాయుడు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అనంతలక్ష్మి, సర్వేయర్ గోపీనాథ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శోభారాణి, పంచాయతీ కార్యదర్శి లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు కృషి చేయాలి



వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

మదనపల్లె : వాల్మీకి, బోయల చిరకాల కోరికైన ఎస్టీ సాధనకు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు కృషి చేయాలని వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాశి హరికృష్ణ, నల్లబోతుల సుదర్శన్‌బాబు కోరారు. మంగళవారం పట్టణంలోని యూనియన్ క్లబ్‌లో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎంపికైన నల్లబోతుల నాగరాజు, మండెం ప్రభాకర్‌లను, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబుతో కలిసి వాల్మీకి మహాసేన ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ముత్తరాశి హరికృష్ణ మాట్లాడుతూ..రాష్ట్రంలో దాదాపు 40లక్షల మంది జనాభా కలిగిన వాల్మీకుల దశాబ్దాల ఎస్టీ సాధన నినాదాన్ని జాతి ప్రతినిధులుగా రాష్ట్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంలో వెనుకబడిన వాల్మీకి జాతికి విరివిగా సహాయం చేయాలన్నారు. ఇదివరకే రెండుసార్లు అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఎస్టీ జాబితా చేర్పు కోసం కేంద్రానికి పంపిన విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం నాయకులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి అన్నారు. మంగళవారం మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థినులతో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తమ పిల్లలు కాలేజీకి సక్రమంగా వస్తున్నారా లేదా అనేది గమనించాలన్నారు. విద్యార్థుల చదువుపై గమనిస్తూ ఉండాలన్నారు. విద్యార్థుల కోసం అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధతో చదువులు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు వనజ, ఖాజావల్లి, జ్యోతి, కుసుమప్రియ, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు పనులు పూర్తిచేయాలి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : అగ్నిప్రమాద ఘటనలో దెబ్బతిన్న సబ్ కలెక్టరేట్ భవన నిర్మాణపనులు డిసెంబర్ చివరిలోపు పూర్తిచేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రస్తుతం సబ్ కలెక్టరేట్ కార్యకలాపాలు హంద్రీనీవా సుజల స్రవంతి భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నామని, పనులు త్వరితగతిన పూర్తైతే, కార్యాలయం పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలవుతుందన్నారు. కార్యాలయంలో చేస్తున్న పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. పనులకు సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులకు పలు సూచనలు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కోళ్లబైలు కాలనీ సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న తోపుకృష్ణప్ప

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు కాలనీలో చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సీసీరోడ్లు, మంచినీటి సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తోపుకృష్ణప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కోళ్లబైలు కాలనీవాసులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ మస్తాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ... కోళ్ళబైలు కాలనీలో సీసీ రోడ్లు, మంచినీటి సమస్యను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు వైఫల్యం చెందారన్నారు. మున్సిపాలిటీకి ఆనుకొని ఉన్న కోళ్ళబైలు కాలనీని అభివృద్ధి చేయడంలో అధికార పార్టీ నేతలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.పేదలు నివసించే ప్రాంతాలలో సమస్యలు పరిష్కారం చేయడంలో, మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఒక వీధిలో సీసీ రోడ్డు వేసి ఇతర వీదుల్లో సీసీ రోడ్లు వేయకుండా వివక్ష చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా సద్వినియోగం చేసుకోండి

పీలేరురూరల్ : మామిడి రైతులు పంట బీమా సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ వై.వి. రమణరావు, ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ రామానాయక్ తాండాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి రైతులు ఎకరాకు రూ. 2250 ప్రీమియం చెల్లించి పంట బీమాను నమోదు చేసుకోవాలని కోరారు. దీంతో ఎకరాకు రూ. 45 వేలు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 15 నుంచి 2025 మే 31వరకు బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్, ఏవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదు

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే చింతల

పీలేరు : ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తలపుల పంచాయతీ కొండూరువాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు మదనమోహన్ నాయుడు కుమారుని వివాహానికి హాజరయ్యారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న సత్యంశెట్టిని పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుందని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం కరెంట్ బిల్లులు ఇష్టానుసారం పెంచి పేదల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. అలాగే విద్య, వైద్య రంగాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దండుజగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా, ఎంపీటీసీ వెంకటరమణ నాయుడు, నాయకులు చక్రపాణిరెడ్డి, మస్తాన్, ఆంజి, ఆనంద, శేఖర తదితరులు పాల్గొన్నారు.

రైతుల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

కలికిరి: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. మండలంలోని మేడికుర్తి గ్రామానికి విచ్చేసిన ఆయన సోమవారం స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న తుపానుల దాటికి రైతులు పండించిన పంట చేతికందక ఇబ్బందులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరుగాలం కష్టపడ్డ పంటను ఏలాగూ నూర్పిడి చేసుకుంటే ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి రెట్టింపు రేట్లతో వ్యాపారులు సామాన్యులను దోచుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఊసెత్తడంలేదన్నారు. మద్యం పేరుతో దందాలు చేస్తూ ఊరూరా బెల్ట్ షాపులు వెలశాయని, మద్యం ఇంటింటికి సరఫరా చేస్తున్న ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వం ప్రజల పట్ల వ్యవహరిస్తున్న అనాలోచిత నిర్ణయాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మేడికుర్తి గ్రామం రేగడగుంటపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డెప్పరెడ్డినిమాజీ ఎమ్మెల్యే చింతల పరామర్శించారు. అలాగే మేడికుర్తికి చెందిన రెడ్డెన్నశెట్టి భార్య మంజుల అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు రత్నశేఖర్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంటరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, మొర్రంకిందపల్లి బాబురెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చెంగారెడ్డి, క్రిష్టారెడ్డి, అనీల్‌రెడ్డి, రెడ్డెప్ప, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే సదస్సుల లక్ష్యం



మదనపల్లె: అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



పీలేరు: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ

మదనపల్లె : భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం అన్ని, సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను 45 రోజుల్లో అధికారులు పరిష్కరిస్తారని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బసినికొండ–1 సచివాలయంలో తహసీల్దార్ ఖాజాబీ, సర్పంచ్ వెంకటరమణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సమస్యలపై 72, ఇతర స్థానిక సమస్యలపై 13 అర్జీలను ప్రజలు సమర్పించారు. అందులో 1 సమస్యను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... భూవివాద రహిత గ్రామాలే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బావాజాన్, ఆర్‌ఐ శేషాద్రి, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని చొక్కాండ్లపల్లె సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 27 వినతులు వచ్చినట్లు తెలిపారు. వాటిలో రెండింటిని అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగరాజు, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, నాయకులు రెడ్డెప్పరెడ్డి, పెద్దిరెడ్డి, శ్రీరాములురెడ్డిలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం: రైతుల భూ సమస్యల పరిష్కారానికే గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ అన్నారు. మండలంలోని ముసలికుంట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం గ్రామ సర్పంచ్ టి జయమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కరించు కోవాలన్నారు. కార్యక్రమంలో వైస ఎంపీపీ టి జయచంద్రారెడ్డి, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు, సర్వేయర్‌లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లువెత్తిన అర్జీలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మల్లెలలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. మొత్తం ప్రజల నుంచి 42 అర్జీలు రాగా అందులో రెవెన్యూకు సంభంధించి 36, మిగిలిన శాఖలకు సంబంధించి 6 అర్జీలు అందాయి. వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపుతామని అధికారులు పేర్కొన్నారు. నోడల్ అధికారి (డీఈఓ) సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, సర్వేయర్ శ్రీవాణి, సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, ఎంఈఓ నారాయణ,ఆర్ఐ బాలాజీ, వీఆర్వో నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 49 అర్జీలు

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నెలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. సదస్సులో 46 రెవెన్యూ సంబంధించి, రెండు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలని, మరొకటి ఇతరులు తమ భూమిని ఆక్రమించాని తహసీల్దార్ రవికుమార్‌కు అర్జీలు అందించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మధుసూధన్, సబ్ రిజిస్ట్రార్ ఉదయకిరణ్‌రెడ్డి, ఎఫ్‌బీఓ రామరాజ్, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారినికే సదస్సులు

పీలేరురూరల్ : రైతుల భూ సమస్యల పరిష్కారినికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాయచోటి ఆర్డీవో ఎ. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని తలపులలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మొత్తం 149 అర్జీలు వచ్చాయని, అందులో 128 భూ సమస్యలకు సంబంధించినవి, 21 వివిధ సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమా, మండల నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో అజయ్, మండల స్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలో 54 వినతులు

కలికిరి: మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి 54 వినతులు వచ్చినట్లు తహసీల్దారు మహేశ్వరి బాయి తెలిపారు. వీటిలో ఎఫ్–లైన్ సమస్యలపై 11, సచివాలయం ద్వారా రెవెన్యూ సమస్యలపై 11 వినతులు, ఆర్ఓఆర్‌కు సంబంధించి 32 వినతులు అందినట్లు ఆమె తెలిపారు. వీటిని త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు.